పట్టణాలకు వెళ్తేనే ఆధార్

- పల్లెల్లో నమోదు కేంద్రాలు లేక ఇబ్బందులు


మీ సేవ కేంద్రంలో వేచి చూస్తున్న మండలవాసులు(ఫైల్)

కోటపల్లి: మారుమూల ప్రాంతాలైన కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో ఆధార్ సర్వీసులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో చెన్నూర్ లాంటి పట్టణాల్లో కొన్ని మీ సేవ కేంద్రాల్లో ఉన్న సర్వీసులను నిలిపివేయడంతో కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 40కిలోమీటర్ల దూరంలో ఉన్న మంచిర్యాల లాంటి పట్టణ ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ వందల సంఖ్యలో జనం క్యూలో ఉండటంతో, రోజుల తరబడి పడిగాపులు, ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్న జిల్లా అధికారులు ఇంతవరకు ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ అప్‌డేట్ చేసేందుకు తప్పుగా పడిన పేర్లను, వయస్సును, మార్పులు చేయించుకోవడం ఫోన్ నంబర్ లింక్ చేయడం, అడ్రస్‌ల మార్పులు, నూతన వధువుల ఇంటి పేర్లు మార్పుకోసం ఇంకా తదితర మార్పులు, చేర్పుల కోసం కోటపల్లి మండల వాసులు చెన్నూర్, మంచిర్యాల లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ అప్‌డేట్ సెంటర్లకు అనుమతినిచ్చినా, అధికారుల నిర్లక్ష్యంతో అడుగు ముందుకు పడటంలేదు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో విద్యార్థుల కోసం ఆధార్ సర్వీస్ నడిచినప్పటికీ, ప్రస్తుతం అది కూడా పని చేయకపోవడంతో విద్యార్థులు పెద్దలతో పాటే పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతీ సంక్షేమ పథకాలకు, పింఛన్లకు, కల్యాణలక్ష్మి పొందేందుకు బ్యాంకులో ఖాతాలు తెరిచేందుకు తదితర అవసరాలకు ఆధార్ తప్పనిసరి అయినప్పుడు ఇక్కడి ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి ఇంకా దారుణం. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధార్ సర్వీసులు జిల్లాలో 11ఆధార్ కేంద్రాలకు మంజూరు ఇచ్చి తాత్కాలికంగా షెడ్లను ఏర్పాటు చేసినప్పటికీ, ఆధార్ నిర్లక్ష్యంతో అవి ప్రారంభానికి నోచుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పనుల కాలం కావడంతో ఇబ్బందులు ఇంకా ఎక్కువవుతుంటాయని ప్రజలంటున్నారు. కోటపల్లి మండలకేంద్రంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మండలంలో ఏర్పాటు చేయాలి



మండలంలో ఆధార్ సెంటర్లు లేక చాలా ఇబ్బంది అవుతోంది. లక్ష్మీపూర్ నుంచి చెన్నూర్, మంచిర్యాల లాంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ఇకనైన మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

- సంపత్, లక్ష్మీపూర్

రోజూ తిరుగలేకపోతున్నాం...



మా మండలంలో ఆధార్‌సెంటర్ లేక చెన్నూర్ లేదా మంచిర్యాల లాంటి ప్రాంతాలకు పోవాలంటున్నారు. అంత దూరం వెళ్లినా సకాలంలో పని కావడం లేదు. మరో రోజు పోవాల్సి వస్తోంది. ఇక్కడే సెంటర్ ఏర్పాటు చేస్తే మా బాధలు తీరుతాయి.

- మహేశ్, పుల్లగామ

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రారంభించాలి



ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధార్ సెంటర్లను ప్రారంభించాలి. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లి ఆధార్ మార్పులు చేసుకునే ఆర్థి క స్థోమత లేని వారు చాలా మంది ఉన్నారు.

- సతీశ్‌రెడ్డి, సిర్సా

క్లుప్తంగా

హెల్త్ క్యాంపునకు రావాలని ఆహ్వానం


మంత్రి గంగుల కమలాకర్‌ను ఆహ్వానిస్తూ...

మంచిర్యాలటౌన్: ఈ నెల 13వ తేదీన మంచిర్యాలలో నిర్వహించే ఉచిత మెగా హెల్త్ క్యాంపునకు రావాలని మంత్రి గంగుల కమలాకర్‌ను హెల్త్ క్యాంపు నిర్వాహకులు గురువారం కరీంనగర్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గొంగళ్ల శంకర్, ఖాజామియా, గాదె సత్యం, సంజీవ్ పాల్గొన్నారు.

మిఠాయిల పంపిణీ

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై స్థానిక సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మిఠాయిలు పంపిణీ చేశారు. ఆర్టీసీ బిల్లు ఆమోదం తెలిపిన గవర్నర్ తమిళిసై, అసెంబ్లీ బిల్లు ప్రవేశపెట్టిన కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ గౌరవ అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి భీమేశ్వర్‌రావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు రాజేశం, శంకర్, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్, జిల్లా పార్టీ అధ్యక్షుడు రామడుగు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు, ఉద్యోగుల ఇళ్లపై జాతీయ జెండా ఎగరాలి

మందమర్రిరూరల్: ఈ నెల 13,14,15 తేదీల్లో ప్రతి సింగరేణి ఉద్యోగి ఇంటిపై జాతీయ జెండా ఎగురాలని ఏరియా జీఎం మోహన్ రెడ్డి సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో నిర్వహించే హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా ఏరియాలోని ప్రతి ఉద్యోగి ఇంటిపై ఎగురవేసిన జాతీయ జెండా ఎదుట సెల్ఫీ తీసి https://harghartiranga.com వెబ్ సైట్‌లో పోస్ట్ చేయాల్సిందిగా జీఎం ఒక ప్రకటనలో కోరారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో బీజేపీ, ఎస్సీ మోర్చా శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంటా చౌరస్తా వద్ద గురువారం హైదరాబాద్ మలక్‌పేటలో ఎంఐఎం పార్టీకి చెందిన కొందరు ఓ దళిత వ్యక్తి భార్యను తీవ్రంగా వేధించినా, ప్రభుత్వం పట్టించుకోక తీవ్ర నిర్లక్ష్యం వహించిందని ఆరోపిస్తూ కమలనాథులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మకు నిప్పంటించి నిరసన తెలిపారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషాను పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు పీక లక్ష్మణ్, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, బీజేపీ, ఎస్సీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

'నిర్మాణాలు ఆపాలి'

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల శివారు శ్రీశ్రీనగర్‌లో సర్వే నంబరు 483ప్రభుత్వ అసైన్డ్ భూమిని తప్పుడు సర్వే నంబరు 484పట్టా భూమిగా పత్రాలను చూపించి ఇంటి నిర్మాణాలు చేస్తున్నారని, వాటిని ఆపేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ జనసమితి నాయకులు మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. బచ్చలి ప్రవీణ్, షేక్ సల్మాన్, పుర్రెళ్ల నితీష్, సామల శివతేజ, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'విధుల్లోకి తీసుకోకుండా వేధింపులు'

చెన్నూర్: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో గణితశాస్త్రం బోధించేందుకు మైనార్టీ గురుకుల పాఠశాలల కార్యదర్శి షేఫియాల్లా జాయినింగ్ ఉత్తర్వులు జారీ చేశారని, గత పక్షం రోజుల నుంచి విధుల్లోకి తీసుకోకుండా జిల్లా డీఎండబ్ల్యూవో రాజేశ్వరి, ఆర్ఎల్‌సీ శ్రీధర్ వేధిస్తున్నారని తోట లక్ష్మణ్ ఆరోపించారు. ఈ సందర్భంగా చెన్నూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో గణితం బోధించే ఉపాధ్యాయుడు లేక పదో తరగతి విద్యార్థులు నష్టపోతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని దూషించటంతో పాటు కొట్టిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల బాధ్యులు శ్రీనివాస్, వంశీ, శివ పాల్గొన్నారు.

బోదకాలు నివారణపై అవగాహన


దండేపల్లి: మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ


నెన్నెల: మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రమాదేవి


కోటపల్లిలో మాత్రలు వేస్తూ...

కోటపల్లి/మందమర్రిరూరల్/దండేపల్లి: బోదకాలు నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం పలు మండలకేంద్రాల్లో బోదకాలు నివారణ మాత్రలు పంపిణీ చేసి, బోదకాలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ నెల10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు బోదకాలు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం ఉంటుందని వైద్యులు సూచించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోటపల్లిలో డాక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో మందులు పంపిణీ చేయగా కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సుమలత, ఏఎన్ఎం విజయలక్ష్మి, నాయకులు రాగం స్వామి పాల్గొన్నారు. దండేపల్లిలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో మల్లేశం, మండల వైద్యాధికారి సతీష్, ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, మందమర్రిలో డాక్టర్ భవాని, బీఆర్ఎస్ నాయకులు రాజశేఖర్, ఇసాక్, శ్రీకాంత్, ఉమామాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్/వేమనపల్లి/నెన్నెల: క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో బోదకాలు రాకుండా తీసుకోవాల్సిన మాత్రలు, పాటించాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ మానస, డాక్టర్ ప్రత్యూష అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ వెంకటనారాయణ పాల్గొన్నారు. నెన్నెల పీహెచ్‌సీలో ఎంపీపీ రమాదేవి మందుల పంపిణీ ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్, ఫార్మసిస్ట్ నారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వేమనపల్లిలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బోదకాల నివారణ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సరోజ, ఎంపీహెచ్‌ఏ లింగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట/బెల్లంపల్లి: మండలంలోని మాలగురిజాల గ్రామంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, బెల్లంపల్లి ఎంపీపీ శ్రీనివాస్, వైద్యులు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాళ్లగురిజాల పీహెచ్‌సీ వైద్యుడు అనీష్, హెచ్ఈఓ సమ్మయ్య, ఎంపీటీసీ శకుంతల, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. లక్సెట్టిపేటలో 49,674మంది అర్హులుగా గుర్తించామని, వాటిలో మొదటి రోజు 855మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు ఆస్పత్రి వైద్యాధికారి సతీష్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దీక్షిత్, హెచ్ఈవో లక్ష్మణ్‌స్వామి, సూపర్‌వైజర్లు రత్నకుమారి, శాంతకుమారి తదితరులున్నారు.

'విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం'


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చెన్నూర్: ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుండిగల అనిల్ అన్నారు. జిల్లా విద్యారంగ సమగ్ర అభివృద్ధి కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తలపెట్టిన జీపుయాత్ర గురువారం చెన్నూర్‌కు చేరింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని కళాశాలలో కనీస సౌకర్యాలు లేవన్నారు. జిల్లా కేందానికి దూరంగా ఉన్న చెన్నూర్‌లో ఇంటర్ విద్యార్థిని, విద్యార్థులకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు మాదాసు రాజు, ఈదునూరి అభినవ్, బండి సత్యనారాయణ, పెద్దపల్లి సంజయ్, సాయి, గణేశ్ పాల్గొన్నారు.

జన్నారం చేరిన 'జీపుయాత్ర'

జన్నారం: తెలంగాణ ప్రభుత్వం కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా అమలు చేయకుండా మరిచిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ ఆరోపించారు. విద్యారంగ సమగ్ర అభివృద్ధి కోసం ఎస్ఎఫ్ఐ చేపట్టిన 'జీపుయాత్ర' గురువారం సాయంత్రం జన్నారం చేరింది. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్పులు బకాయిలున్నాయని, రాష్ట్రంలో 25వేలకు పైగా టీచింగ్, నాన్ టీచింగ్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఎస్ఎఫ్ఐ పోరాడుతుందన్నారు. సమావేశంలో యాత్ర బృందం అభినవ్, మాదాసు రాజు, దినేశ్, సాయి, గణేశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

'అనాథ పిల్లలకు చేయూత'

లక్సెట్టిపేట: తల్లిదండ్రులు మృతి చెంది అనాథలైన పిల్లలను లక్సెట్టిపేటకు చెందిన శ్రీ శివసాయి గణేష్ సేవా సమితి అక్కున చేర్చుకుంది. లక్సెట్టిపేట మండలం ఎల్లారం గ్రామానికి రేగంద మల్లికార్జున్, అతడి భార్య శరణ్య ప్రమాదవశాత్తు మరణించగా, వారికి గల ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. గ్రామ సర్పంచ్ శ్రీలత ద్వారా తెలుసుకున్న సమితి సభ్యులు గురువారం సమితి అధ్యక్షుడు పాటిబండ్ల రామ్మూర్తి పుట్టినరోజు సందర్భంగా వారి ఆలనా, పాలనా ఖర్చులు, బట్టలు, చదువు, ఆరోగ్యం పూర్తి బాధ్యత తీసుకుంటామని తీర్మానించినట్లు తెలిపారు.

విద్యార్థుల శ్రమదానం



చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ప్రాజెక్ట్ అధికారి శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో విద్యార్థులు శ్రమదానం చేశారు. కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించారు. ప్రిన్సిపాల్ నాగచందర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు


లక్ష్మీనగర్‌లో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నస్పూర్: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు తెలిపారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. రెండో వార్డులోని లక్ష్మినగర్, సుభాష్‌నగర్‌లలో డీఎంఎఫ్‌టీ నిధులతో పూర్తి చేసిన సీసీ రోడ్లు, డ్రెయిన్‌లను ఆయన ప్రారంభించారు. కొందరు ప్రతిపక్ష, విపక్ష నాయకులు వాస్తవాలు తెలుసుకోకుండా తనపై అవాకులు, చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కౌన్సిలర్లు వంగ తిరుపతి, మడిగ మల్లయ్య, బెడిర లక్ష్మి, మర్రి రాజమౌళి, కుర్మిల్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు నౌండ్ల సంతోష్‌చారి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బాబా తాజొద్దిన్ ఉర్సు ఉత్సవాలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో గురువారం హజ్రత్ సయ్యద్ మొహమ్మద్ బాబా తాజొద్దిన్ రహితుల్ల అలై 101వ ఉర్సు ఉత్సవాలను జశ్న తాజుల్ వర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి, కులమతాలకు అతీతంగా ఉర్సు ఉత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి, సాయంత్రం కవ్వాలి కార్యక్రమాలు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం యూత్ అధ్యక్షుడు ఎండి సోహైల్‌ఖాన్, అలిం తాజి, సమీర్, సమి, ఖాజామియా, గొంగళ్ల శంకర్, సంజీవ్, వెంకట్ సాయి పాల్గొన్నారు.

అనాథ పిల్లల వివరాలు నమోదు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లల వివరాలను సేకరించి, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మెప్మా కార్యాలయంలో గురువారం ఆర్పీలకు అనాథ పిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీలోగా తల్లిదండ్రులు లేకుండా, వారి కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లల్లో ఉంటున్న అనాథ పిల్లల వివరాలను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది చంద్రయ్య, సుజాత, అరుణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలటౌన్: మున్సిపల్ పారిశుధ్య, నీటి సరఫరా, ఎలక్ట్రిషియన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు దేవీ సత్యం, అధ్యక్షులు శంకర్, ప్రధాన కార్యదర్శి ఏ గోపాల్, మంచిర్యాల జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలి

మంచిర్యాలటౌన్: ఎంతో కాలంగా లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఒకే నెలలో జేఎల్, గురుకులం, తదితర పరీక్షలు ఉండటం వల్ల గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి తులా అంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జన్నారం ఎస్సైకి ప్రశంస

జన్నారం: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ప్రజలను అప్రమత్తం చేసి సేవలందించిన జన్నారం ఎస్సై సతీశ్‌కు ప్రశంసాపత్రం లభించింది. రామగుండం కమిషనరేట్ పరిధిలో కమిషనర్ రెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన ఎస్సైలకు ప్రశంస పత్రాలు అందజేశారు.

'గడపగడపకూ పీఎస్సార్'

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 5వ వార్డులో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ గడపగడపకూ పీఎస్సార్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా రమేశ్

మందమర్రిరూరల్: పట్టణానికి చెందిన తుంగపిండి రమేశ్‌ను బీఎస్పీ చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంపీ గుణ రమేశ్‌కు నియామక పత్రం అందించారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

నస్పూర్: పట్టణ పరిధిలోని విలేజ్ శ్రీరాంపూర్ వద్ద మంచిర్యాల నియోజకవర్గ ఆమ్‌ఆద్మీపార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర కన్వీనర్ దొడ్డి సుధాకర్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యులు మజీద్, పెద్దపల్లి పార్లమెంటు కన్వీనర్ మాలం మధు, యూత్ విభాగం అధ్యక్షుడు రణధీర్ సింగ్, జిల్లా కన్వీనర్ నల్ల నాగేంద్రప్రసాద్, జనరల్ సెక్రటరీ నయీంపాషా, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మందమర్రిరూరల్: మండలంలోని శంకర్‌పల్లి గ్రామానికి చెందిన దర్శనాల రమేష్, అతడి కుమారుడు ఇటీవల శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబానికి టీం పంచముఖి యూత్ సభ్యులు రూ.25వేలు సేకరించి రమేష్ కూతురు సువిష్ణ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ బాండును రమేష్ భార్య వెన్నెలకు గురువారం సీఐ మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు.

సాదాసీదాగా మండల సమావేశం

నెన్నెల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం గురువారం నామమాత్రంగా జరిగింది. మూడు గంటల పాటు 25అంశాలపై సమీక్ష జరపాల్సి ఉండగా అరగంటలో ముగించారు. ప్రజాప్రతినిధులు బెల్లంపల్లిలో జరిగే కుల వృత్తుల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉండటంతో ఒక్కొక్కరు రెండు నిమిషాల్లోనే సమీక్ష ముగించాలని ఎంపీపీ అనడంతో ఏ శాఖపై పూర్తి స్థాయి చర్చ జరగలేదు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సింగతి శ్యామల, ఎంపీడీఓ వరలక్ష్మి, ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, సీడీపీఓ ఉమాదేవి, మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్, వైద్యాధికారి దిలీప్, పంచాయతీ రాజ్ ఏఈ కామేశ్వర్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ మల్లయ్య, ఇరిగేషన్ ఏఈ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంల నిరసన


బెల్లంపల్లి: మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు

బెల్లంపల్లి: సెకండ్ ఏఎన్ఎంలను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని బీజేపీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద గురువారం నిరసన చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంల దీక్షా శిబిరాన్నీ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు వైద్యసేవలు అందించడంలో ఏఎన్ఎంల పాత్ర ఎంతగానో ఉందన్నారు. కరోనా వంటి విపత్కాలంలో ప్రాణాలకు తెగించి వైద్యసిబ్బంది రోగులకు సేవలు చేసి ప్రాణాలు కాపాడారన్నారు. సెకండ్ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరణ చేస్తామని ప్రకటించి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, బీజేపీ, ఎస్సీ మోర్చా నాయకులు ఎరుకల శ్రీనివాస్, కోడి సురేష్, రాజనర్సు, విజయ్, రాజశేఖర్, శ్రీనివాస్, రాంచందర్, అశోక్, యుగంధర్, వెంకటేష్, రాజలింగు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: సమస్యల పరిష్కారం కోసం సెకండ్ ఏఎన్ఎంలు చేపట్టిన నిరసనలు కొనసాగుతున్నాయి. దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సెకండ్ ఏఎన్ఎంలు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన దీక్ష చేపట్టారు.

జన్నారం: కాంట్రాక్టు ఏఎన్ఎంలను యథావిధిగా రెగ్యూలర్ చేస్తూ ప్రభుత్వం వేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్‌తో గురువారం జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కాంట్రాక్టు ఏఎన్ఎంలు బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు లవన్‌భాయి, మాధవి, కల్పన, రాజేశ్వరి, సౌభాగ్య, వసంత, దేవమ్మ, పద్మ, స్రవంతి, ప్రియాంక పాల్గొన్నారు.

జైపూర్: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సెకండ్ ఏఎన్ఎంలు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలు శ్రీలత, వెంకటేశ్వరి, యశోద, సుజాత, రాణి తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్: జిల్లాలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు నస్పూర్ పీహెచ్‌సీ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు రమాదేవి, సరోజ, సునంద తదితరులు పాల్గొన్నారు.

భీమిని: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరుతూ భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ద్వితీయ శ్రేణి ఏఎన్ఎంలు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఈశ్వరి, పద్మ, సుగుణ, రజిత, శ్రీవాణి, మీన, రేణుక, మనోహరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీలకు ప్రభుత్వం చేసిందేమీ లేదు'

కాసిపేట: రాష్ట్రంలో ఆదివాసీలు ఏ గిరిజన గూడెంలో సైతం సంతోషంగా లేరని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేముల కృష్ణ విమర్శించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు ఆదేశాల మేరకు బుధవారం రాత్రి ఆదివాసీ గ్రామం గురువాపూర్‌లో పల్లెనిద్ర చేశారు. రాష్ట్రం ఏర్పాటుతో ఆదివాసీల బ్రతుకులు మారుతాయని ఆశపడిన ఆదివాసీలకు ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. ప్రతి గ్రామంలో ధరణి పేరుతో ఆదివాసీలు మోసపోయారన్నారు. నేటికి గ్రామంలో రోడ్లు సక్రమంగా లేవని, పోడు భూములతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు సిద్ధం తిరుపతి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కనుకుల రాకేష్, నాయకులు గోలేటి స్వామి, మైదం రమేష్, శివ, జంపన్న, వెంకటేష్ తదితరులున్నారు.